క్లుప్తంగా

రామేశ్వరస్వామి రథోత్సవం



టేకుపల్లి(మోపిదేవి): మండలంలోని టేకుపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ బాల పార్వతి సమేత రామేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా గురువారం ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పాలతో వేదపండితులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాలు, సాయంత్రం 6.30 గంటలకు స్వామివార్ల రథోత్సవం వైభవంగా నిర్వహించారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



గూడూరు: వేసవి సెలవులను పురస్కరించుకుని గూడూరు శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. లూడో, స్నేక్ అండ్ గ్లాడర్ తదితర ఆటల పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ 20 రోజుల నుంచి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. శుక్రవారంతో శిబిరం ముగుస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు చివరి రోజు బహుమతీ ప్రదానం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

ముడా చైర్‌పర్సన్ నాగదుర్గాభవాని రాజీనామా

మచిలీపట్నంటౌన్: ఎంయూడీఏ(ముడా) చైర్ పర్సన్ బొర్రా నాగదుర్గాభవాని ఆమె పదవికి గురువారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ముడా వైస్‌చైర్మన్ పి. వెంకటరమణకు అందజేశారు. మూడేళ్లుగా ఆమె ఎంయూడీఏ చైర్‌పర్సన్‌గా పని చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పరాజయం పొందడంతో ఆమె పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ




మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి ప్రధాన గుడి సెంటర్‌లో భక్తులకు గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం అర్చకులు బుద్దు సతీష్ శర్మ మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. మోపిదేవి మండల పాత్రికేయులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



పెడన: పట్టణంలోని నిరుపేదలకు పిచ్చుక దుర్గానాగేశ్వరి జ్ఞాపకార్థం ఆమె కుమారుడు వేణుగోపాలరావు ఆర్థిక సాయంతో గురువారం నిత్యావసర సరుకులను వితరణ చేశారు. హైదరాబాద్‌కు చెందిన వేణుగోపాలరావు తల్లి పుణ్యతిథి పురస్కరించుకుని ఈ సాయం అందజేశారని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రంథాలయ సైన్సు అధ్యాపకులు పేరిశెట్టి నాగరవి తెలిపారు. అనారోగ్య కారణాలతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నలుగురు చేనేత కళాకారులకు నెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేశారని పేర్కొన్నారు.

శివరామపురంలో నేలవాలిన చెట్లు



శివరామపురం(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు శివారు శివరామపురంలో నడిరోడ్డుపై చెట్లు నేలవాలాయి. బుధవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి తోడు ఈదురుగాలులకు చెట్లు జెడ్పీ రోడ్డుపై పడ్డాయి. తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆ శాఖ అధికారులు చెట్లను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరింపజేశారు.

ఉన్నత విద్యకు బంగారు బాట

- ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో హైస్కూల్ ప్లస్
- ప్రతి మండలంలో రెండు జూనియర్ కళాశాలలు
- గూడూరులో ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియెట్ ప్రారంభం



ఇంటర్మీడియెట్ కళాశాలగా మారిన గూడూరు జెడ్పీ హైస్కూల్



ఇంటింటికీ వెళ్లి కళాశాల అడ్మిషన్లు చేయిస్తున్న ఉపాధ్యాయులు

గూడూరు: గ్రామీణ ప్రాంతాల్లోని బడుగు, బలహీన వర్గాలకు ఉన్నత విద్యను అందించాలన్న లక్ష్యంతో మండల స్థాయిలో ఇంటర్మీడియట్ విద్య అందుబాటులోకి తెచ్చారు. మనబడి నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మారాయి. అదే ప్రాంగణంలో హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. దీంతో ప్రతి మండలంలో రెండు జూనియర్ కళాశాలు ఏర్పాటు చేసి ఇంటర్మీడియెట్ విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల అవస్థలను తీర్చారు. దీంతో పేద విద్యార్థుల ఉన్నత విద్యకు బంగారు బాటలు వేశారు

మండలంలో రెండు పాఠశాలల ఎంపిక

ప్రతి మండలంలో రెండు పాఠశాలలను ఎంపిక చేసి 'హైస్కూల్ ప్లస్'గా అప్‌గ్రేడ్ చేశారు. వాటిలో ప్రత్యేకంగా బాలికలకు ఒకదాన్ని కేటాయించారు. దీంతో బాలికలను ఉన్నత విద్యావంతులు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. రెండో దాన్ని కో ఎడ్యుకేషన్‌గా ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా గూడూరు మండలంలో మల్లవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలను రెండేళ్ల క్రితం హైస్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారు. ఈ ఏడాది గూడూరు హైస్కూల్లో కో ఎడ్యుకేషన్ ప్రారంభించారు.

అందుబాటులో రెండు గ్రూపులు

ప్రస్తుతం ఇంటర్మీడియెట్‌లో డిమాండ్ ఉన్న ఎంపీసీ, బైపీసీ గ్రూపులను నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు తమకు నచ్చిన గ్రూపును తీసుకోవచ్చు. ఒక్కో గ్రూపునకు 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమం బోధన చేస్తుండటం విద్యార్థులకు కలిసొచ్చే అంశం. ఒక్కో పాఠశాలలో 80 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసించడానికి చర్యలు తీసుకున్నారు. మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఈ పాఠశాలల ఏర్పాటుతో ఉన్నత విద్య చేరువ కానుంది. ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేస్తున్న కళాశాలల పట్ల తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించి, విద్యార్థులను చేర్పించడంలో ఆయా విద్యాసంస్థల ఉపాధ్యాయులు చురుగ్గా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ అడ్మిషన్లు చేయిస్తున్నారు.

జిల్లాలో 18 ఏర్పాటు

రెండేళ్ల క్రితం జిల్లాలో 23 పాఠశాలల్లో ఇంటర్మీడియట్‌ను ప్రవేశ పెట్టారు. ఈ ఏడాది మరో 18 పాఠశాలలను ఎంపిక చేశారు.

వాటి వివరాలు

బాపులపాడు మండలంలోని వీరవల్లి జెడ్పీ హైస్కూల్, చల్లపల్లి మండలంలోని చల్లపల్లి జెడ్పీ హైస్కూల్, ఘంటసాల మండలంలోని శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్, గుడివాడలోని ఎస్‌జీవీఎస్‌జీ బేతవోలు ఎంపీఎల్ హైస్కూల్, గుడ్లవల్లేరు మండలంలోని కౌతరం జెడ్పీ హైస్కూల్, గూడూరు మండలం గూడూరు జెడ్పీ, కంకిపాడు మండలం కంకిపాడు జెడ్పీ, కోడూరు మండలంలోని వి.కొత్తపాలెం జెడ్పీ హైస్కూల్, కృత్తివెన్ను మండలం సంగమూడి జెడ్పీ, మచిలీపట్నం మండలం చిన్నాపురం జెడ్పీ హైస్కూల్, మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి జెడ్పీ, నాగాయలంక మండలం తలగడదీవి జెడ్పీ హైస్కూల్, పమిడిముక్కల మండలం చోరగుడి జెడ్పీ హైస్కూల్, పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ జెడ్పీ, పెనమలూరు మండలం కానూరు జెడ్పీ, తోట్లవల్లూరు మండలం పెనమకూరు జెడ్పీ హైస్కూలు, గన్నవరం మండలం దావాజిగూడెం జెడ్పీ హైస్కూలు, ఉంగుటూరు మండలం ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్ ఉన్నాయి.

22 మందికి అడ్మిషన్లు



గూడూరులో ఈ ఏడాది ఏర్పాటు చేస్తున్న హైస్కూలు ప్లస్‌లో ఇప్పటి వరకు 22 మంది అడ్మిషన్లు పొందారు. వీరిలో 11 మంది ఎంపీసీ, 11 మంది బైపీసీ గ్రూపులను ఎంచుకున్నారు. ఇంకా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. మొదటి ఏడాది కావడంతో పాఠశాలలో ఇంటర్మీడియెట్ బోధన ఏర్పాటు చేసిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేస్తూ ఉపాధ్యాయులంతా ఇంటింటి ప్రచారం నిర్వహించాం. పాఠశాలలో చేరిన వారందరికీ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యాబోధన చేయడమే కాకుండా ఎంసెట్ వంటి పరీక్షలకు పోటీ పడేలా శిక్షణ ఇవ్వాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం.

–డి.పుష్పలత, ప్రధానోపాధ్యాయిని, గూడూరు హైస్కూలు ప్లస్

పుస్తకాలు తగలబెట్టిన ఆకతాయిలు!

- పాఠశాల స్టోర్ రూంలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..



ఎదురుమొండి పాఠశాలలో స్టోర్‌రూంలో తగలబడిన పుస్తకాలు

నాగాయలంక: ఎదురుమొండి జెడ్పీ ఉన్నత పాఠశాల స్టోర్ రూంలో పుస్తకాలు తగలబెట్టిన ఉదంతం ఆలస్యంగా వెలుగుచూసింది. పాఠశాల స్టోర్ రూంలో పాఠ్యపుస్తకాలు తగలబెట్టిన ఘటనపై ఆ పాఠశాల హెడ్మాస్టర్ యు.వి. కోటేశ్వరరావు గత నెల 23న నాగాయలంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దానిలో అంశాల మేరకు అదే నెల 22వ తేదీ సాయంత్రం 4.30 గంటల సమయంలో ప్రమాదం జరిగిందని కారకులు తెలియదని పేర్కొన్నారు. గ్రామంలో కొంత మంది ఆకతాయిలు తరచూ పాఠశాల తరగతులు జరిగే సమయంలో తమను ఇబ్బందులు పెట్టేవారని సిబ్బంది తెలుపుతున్నారు. వారంతా చదువు మానేసి చెడు వ్యసనాలకు బానిసలయ్యారన్నారు. తరచూ పాఠశాలలో జరిగే కార్యక్రమాలకు ఆటంకం కలిగించే వారని, వీరిపై గ్రామంలోని మహిళా పోలీసుకు సైతం ఫిర్యాదు చేయగా ఆమె కూడా వారిని హెచ్చరించారని ఫిర్యాదులో వివరించారు. అయినా వారి తీరు మారలేదన్నారు. ఎదురుమొండి పాఠశాలలో జరిగిన ఘటనపై విచారించి అందుకు కారకులైన వారిని గుర్తించి ఇకపై పాఠశాలకు కలిగే ఇబ్బందుల నుంచి కాపాడాలని ఫిర్యాదులో అభ్యర్థించారు. చాలా కాలంగా కొంతమంది పిల్లలు గ్రామంలో మద్యానికి అలవాటు పడటంతో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని తెలుస్తోంది. ఎంఈఓ టీవీఎం రామదాసును వివరణ కోరగా జరిగిన సంఘటనపై మరుసటి రోజే పాఠశాల హెచ్.ఎం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ధ్రువీకరించారు. దీనిపై నాగాయలంక ఎస్.ఐను వివరణ కోరగా హెచ్ఎం నుంచి ఫిర్యాదు అందిన విషయం వాస్తవమేనన్నారు. ఎన్నికల హడావుడిలో కొంత జాప్యమైందని అంటూ, నలుగురైదుగురు పిల్లలను విచారణ చేసి వారి తల్లిదండ్రులకు ఈ పిల్లలకు కౌన్సిలింగ్ ఇచ్చామని స్పష్టం చేశారు.

పూర్వ విద్యార్థుల చేయూత



నిత్యావసరాలు అందజేస్తున్న స్నేహితులు

చల్లపల్లి: పూర్వ విద్యార్థులు చిన్ననాటి స్నేహితుడికి చేయూతనిచ్చారు. స్థానిక పడమర వైపు నివసించే నిరుపేద ఆటోడ్రైవర్ నాదెండ్ల సిద్ధేశ్వరరావు ఇటీవల పక్షవాతానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. తమ స్నేహితుని దీన స్థితి తెలుసుకున్న ఆయన చిన్ననాటి మిత్రులు ఎస్ఆర్‌వైఎస్‌పీ హైస్కూల్ 1981–82 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు గురువారం సాయంత్రం నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో పాగోలు నాగ సీతారామారావు (ఫణి), మేకా శివనాగేశ్వరరావు, ఉప్పాల ఏడుకొండలు, మోతుకూరి ఏడుకొండలు, వక్కలగడ్డ శివప్రసాద్, రావి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధురాలి మృతి



కోనేరుసెంటర్: మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధురాలు గురువారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బస్టాండ్ సెంటర్‌కు సమీపంలోని ఖైల్ కంపెనీ వెనుక రోడ్డులో గుర్తు తెలియని వృద్ధురాలు మూడు రోజుల క్రితం స్పృహ తప్పి పడిపోయింది. స్థానికులు 108కు ఫోన్ చేసి సదరు వృద్ధురాలిని మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అప్పటినుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు గురువారం మృతి చెందారు. మృతురాలు ఎర్ర రంగు చీర పచ్చ రంగు జాకెట్ ధరించి ఉన్నారు. ఆమె వయసు సుమారు 60 సంవత్సరాలు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి ఆచూకీ తెలియకపోవడంతో గుర్తుతెలియని మహిళ మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిలకలపూడి సీఐ సీహెచ్ సతీష్ కుమార్ తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే 08672–252233 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం తెలియజేయాలని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

మచిలీపట్నంటౌన్: నగరంలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ ఎం.భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు పాత హౌసింగ్‌బోర్డు కాలనీ, కొత్త హౌసింగ్‌బోర్డు కాలనీ, డ్రైవర్స్‌కాలనీ, గుమస్తాల కాలనీ, బలరామునిపేట, నిజాంపేట, ఈడేపల్లి శక్తి గుడి, జిల్లా కోర్టు వెనుక ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

ఘనంగా రాజశేఖరస్వామి ఊరేగింపు



అవనిగడ్డ: రాజశేఖరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం పురస్కరించుకుని గురువారం స్వామికి ఊరేగింపు నిర్వహించారు. తొలుత స్వామికి ఆలయ అర్చకులు ఘంటసాల రాజశేఖర శర్మ, సత్యనారాయణశర్మ ప్రత్యేక అలంకారం చేశారు. ఈ సందర్భంగా బిందె తీర్థం, బలిహరణ, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం హోమ క్రతువు జరిపించారు. సాయంత్రం స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



శిక్షణకు హాజరైన విద్యార్థులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని బ్యాంక్ విశ్రాంత ఉద్యోగి ఎస్.బాబూరావు అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు గ్రంథాలయాలు-ప్రయోజనాలు అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత విద్యార్థులకు వివిధ రకాల అంశాలపై గ్రంథాలయంలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలకు వెళ్లటం, పుస్తకాలు చదవటం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. విద్యార్థులకు కథలు చెప్పటం, వారితో కథలు చదివించటం, జనరల్ నాలెడ్జ్, నృత్యాలు, చెస్, క్యారమ్స్ వంటి ఇండోర్ గేమ్స్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం లైబ్రేరియన్ స్వర్ణ లతాదేవి, రిటైర్డ్ ఉద్యోగి ఎస్.బాబూరావు గ్రంథాలయాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

ఘనంగా ఆరాధనా మహోత్సవాలు

గుడివాడ టౌన్: స్థానిక దనియాలపేటలోని శ్రీ ప్రణవాశ్రమంలో ప్రణవానందస్వామి వారి 55వ ఆరాధనా మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రణవాశ్రమ పీఠాధిపతులు స్థైర్యానంద సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. అనంతరం స్వామి వారి అన్నప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ ఆర్.వేణుబాబు, భక్తులు సీహెచ్ శ్రీనివాసరావు, వి.సూరిబాబు, ఎ.శివయ్య, ఎస్.శేషగిరిరావు, అర్చకులు కోట శ్రీనివాసశర్మ, భక్తులు పాల్గొన్నారు.

ఈదురుగాలులు.. భారీ వర్షం..



కోడూరు ప్రధాన రహదారిపై మాచవరం వద్ద నిలిచిన వర్షం నీరు

కోడూరు: రుతుపవనాల ప్రభావంతో దివిసీమ ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. రాత్రి 11 నుంచి అర్ధరాత్రి 2గంటల వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వాన ప్రభావంతో కోడూరు, చుట్టు పక్కల గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. గాలుల తీవ్రతకు పలు చోట్ల చెట్లకొమ్మలు విరిగి రహదారులపై అడ్డుగా పడ్డాయి. అవనిగడ్డ–కోడూరు ప్రధాన రహదారిపై కూడా నీరు నిలిచింది. గాలుల తీవ్రతకు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.

బంటుమిల్లి: మండలంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రాత్రి 9 గంటలకు మొదలైన వాన సుమారు గంటకుపైగా కురిసింది. రెవెన్యూ రికార్డుల మేరకు సుమారు 138 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ భారీ వర్షంతో బంటుమిల్లి జగనన్న కాలనీతోపాటు బీసీ కాలనీ, జానకీరామపురం వీధులు జలమయమయ్యాయి

మెట్ట దుక్కులు ప్రారంభం



లక్ష్మీనారాయణపురం గ్రామంలో మెట్ట దుక్కులు

మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు మెట్ట దుక్కులు ప్రారంభించారు. రైతులు గత కొద్ది సంవత్సరాలుగా వ్యవసాయ ఖర్చులు తగ్గించుకునేందుకు వెద పద్ధతిని అవలంభిస్తున్నారు. దీంతో తొలకరి వర్షంతో రైతులు మెట్ట దుక్కులు చేపట్టారు. ములపర్రు, అర్తమూరు, నారాయణపురం, మల్లేశ్వరం తదితర పంచాయతీల్లో రైతులు దాదాపు ఏడు వేల ఎకరాల్లో వెద పద్ధతిలో విత్తనాలు చల్లేందుకు భూములు సిద్ధం చేస్తున్నారు.

భూపోరాట యోధుడు చండ్ర రాజేశ్వరరావు



సీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

చల్లపల్లి: పేదలకు భూ పంపిణీ కోసం కమ్యూనిస్టు పార్టీ సాగించిన పోరాటాల్లో కీలక పాత్ర పోషించింది భూ పోరాట యోధుడు చండ్ర రాజేశ్వరరావు అని రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అన్నారు. స్థానిక సీఆర్ వికాస కేంద్రంలో గురువారం భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు 110వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్ మనుమడు పరుచూరి రామ కోటేశ్వరరావు, పార్టీ నాయకులు గుత్తికొండ రామారావు, మల్లుపెద్ది బోసు, కొర్రపాటి ముఖర్జీ, కోదాటి నాగయ్య, మల్లుపెద్ది రత్నకుమారి, కంఠంనేని జ్యోత్స్నాదేవి పాల్గొన్నారు.

అవనిగడ్డలో నిలిచిన పారిశుద్ధ్య పనులు



అవనిగడ్డ పంచాయతీ కార్యాలయం వద్ద నిలిచిన చెత్త రిక్షాలు

అవనిగడ్డ: అవనిగడ్డ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి. కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు అందక పోవడంతో పనులు మానేశారు. అవనిగడ్డ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు 35 మంది, గ్రీన్ అంబాసిడర్లు 25 మంది ఉన్నారు. గ్రీన్ అంబాసిడర్లలో స్థానికులు 11 మంది ఉండగా, మిగిలిన 14 మంది రేపల్లె ప్రాంతాల నుంచి వస్తున్నారు. మూడు నెలలుగా వీరికి జీతాలు అందక పోవడంతో గురువారం విధులకు హాజరు కాలేదు. ఒక్కరోజు పనులకు రాకపోతేనే అవనిగడ్డలో ఎక్కడి చెత్త అక్కడ నిలిచిపోయింది. వర్షాకాలం కావడంతో చెత్త కుళ్లితే వ్యాధులు బారిన పడతామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వాల్సిన బకాయి వేతనాలను వెంటనే ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రూ.1.20 లక్షలతో పంటకాల్వ పనులు

మండవల్లి: మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలో రూ.1.20 లక్షల ఉపాధి హామీ నిధులతో పంట కాలువ అభివృద్ధి పనులను గురువారం చేపట్టారు. 66 మంది కూలీలు పనులు చేశారు. ఎంపీఏ ఎస్.నవీన్ మాట్లాడుతూ పంట కాలువలు, బోదెలు అభివృద్ధితో పొలాలకు సాగునీరు సమృద్ధిగా చేరుతుందని చెప్పారు. రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు కాల్వ అభివృద్ధి దోహదపడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మొవ్వ: పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ శాస్త్రి ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణ బాధ్యతలు కూడా తీసుకోవాలన్నారు. అధ్యాపకులు వి.శ్రావ్యరెడ్డి, హెచ్.మాధవిలత, బి.గౌరమ్మ పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బజారు బ్రాంచ్, మచిలీపట్నం వారి జాయిస్ ప్రకారం తెలియచేయునది ఏమనగా శ్రీమతి మంటిగ సుధారాణి భర్త : సత్య శివ కుమార్ నివాసం : డోర్ నెం. 5-4-902/1, రోడ్డు నెం. 2, సుభద్రా నగర్, వనస్థలిపురం, హయత్ నగర్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ స్టేట్ వారు గృహ నిర్మాణము కొరకు ఋణము పొందుటకు నా క్లయింటును సంప్రదించినారు. శ్రీమతి మంటిగ సుధారాణి గారి ఈ దిగువ షెడ్యూలు ఆస్తి వారి నాయనమ్మ గారు అయిన బందారు రంగనాయకమ్మ గారు ది. 28.10.1926వ సం.లో మచిలీపట్నం అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ వారి వద్ద నుండి 3963/1926 దస్తావేజు ద్వారా 2000 చ.గజం స్థలం అందు పెంకుటిల్లును క్రయం పొంది, సదరు ఆస్తిని అనుభవించుచు ఉండగా 1987 సం.లో [illegible] సీతారమ్మ భర్త : నారాయణ గారు అదర్వు సంగతులతో దావానెం. 136/1987 దాఖలు చేయగా, శ్రీకోర్టు వారు విచారించి ది. 14.08.1997న సదరు దావాని డిస్మిస్ చేసినట్లు ది. 15.11.1978వ తేదీన బందారు రంగనాయకమ్మ గారు ఒక వీలునామా వ్రాయించి అన్ రిజిస్టర్డ్ గా ఉంచి ది. 28.01.1979న మరణించినారు. అని సదరు వీలునామా ప్రకారం సదరు ఆస్తి నందు 1/5 వంతు శ్రీమతి కొల్లి నాగరత్నమ్మ గారికి 4/5వ వంతు బందారు శకుంతల గారికి చెందులాగున వ్రాయించినట్లు తదుపరి శ్రీమతి కొల్లి నాగరత్నమ్మ గారు తన 1/5వ వంతు వాటిని శ్రీమతి బందారు శకుంతల గారికి చెందు లాగున ఒక వీలునామాను ది. 06.10.1987న వ్రాయించి అన్ రిజిస్టర్డుగా ఉంచి ది.07.08.2000న మరణించినట్లు తదుపరి శ్రీమతి బందారు శకుంతల గారికి సదరు ఆస్తి మొత్తము సంక్రమించి వారి పేరు మున్సిపల్ రికార్డుల లోనికి నమోదు కాబడి పూర్తి హక్కులతో అనుభవించుచు సదరు ఆస్తిలోని కొంత భాగము [illegible] విక్రయించినట్లు తదుపరి ది.26.02.2019న ఇంటస్టేట్గా మరణించినట్లు సదరు ఆస్తి బందారు శకుంతల గారి వారసులు అయిన 1) చౌదరి రంగ శ్యామల 2) మంటిగ సుధారాణి 3) గంధం పద్మావతి గారు లకు సంక్రమించినట్లు, తదుపరి గంధం పద్మావతి ఆవిడ భర్త గారు మరణించినందున గంధం పద్మావతి గారి వారసులు అయిన 1) గంధం పూర్ణచంద్రరావు 2) గంధం కార్తీక్ లు వారసులు అయినందున ది. 06.03.2024న 1) చౌదరి రంగశ్యామల 2) గంధం పూర్ణచంద్రరావు 3) గంధం కార్తీక్ లు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని మంటిగ సుధారాణి గారి పేరున దఖలు దస్తావేజీ నెం. 10517/2024 ద్వారా సంక్రమింపచేసినట్లు, తదుపరి సదరు ఆస్తిని సర్వ హక్కులతో ఆస్తి పన్నులు చెల్లించుచూ మంటిగ సుధారాణి గారు అనుభవించుచున్నట్లు సదరు మంటిగ సుధారాణి గారు తెలిపియున్నారు.

కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తి పై ఎవ్వరికి ఏ విధమైన హక్కులు గాని, కోర్టు లావాదేవీలు గాని, అప్పులు గాని, ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన (7) ఏడు దినములలో ఈ క్రింది అభ్యంతరము గాని, బ్యాంకు వారికి గాని రిజిస్టరు పోస్టు ద్వారా తమ అభ్యంతరములు తెలియపర్చగలరు. అట్లు రాని యెడల సదరు ఆస్తి నిర్వివాదమైన వివాదరహితమైన ఆస్తిగా పరిగణించి నా క్లయింటు సదరు ఆస్తిపై ఋణము మంజూరు చేయుదురు తదుపరి వచ్చు క్లెయిములు నా క్లయింటును గాని ఆస్తిని గాని బైండు చేయజాలవు.

షెడ్యూలు : కృష్ణాజిల్లా, స.రి. వారి ఏలకా, మచిలీపట్నం టౌన్, మాచవరం, ఆర్.ఎస్ నెం.203/ 2,3,4 క్ష మున్సిపల్ వార్డు - 16, డోర్ నెం. 16/142నకు చెందిన చ.గ. 184-76లు లేక చ.మీ. 154-484క్ష స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు: **తూర్పు :** ఈ ఆస్తి ప్రహరీ గోడ అవతల [illegible] గారి ఖాళీ స్థలం అ. 26.6.లు, **దక్షిణం :** ఈ ఆస్తి ప్రహరీ గోడ అవతల [illegible] దారి అ.62.9 లు, **పడమర :** ఈ ఆస్తి ప్రహరీ గోడ అవతల మున్సిపల్ రోడ్డు అ. 62.9. లు, **ఉత్తరం :** ఈ ఆస్తి ప్రహరీ గోడ అవతల [illegible] శ్రీనివాసరావు గారి స్థలం అ. 629. లు. ఈ హద్దుల మధ్య చ.గ.184-76 లు లేక చ.మీ. 154.484 క్ష స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలము మున్సిపల్ అసెస్మెంట్ నెం. 1070029355నుగా ఉన్నది.

మచిలీపట్నం
తేది: 06.06.24

ఇట్లు [illegible], బి.ఎస్.సి. బి.ఎల్., న్యాయవాది, 20/16, మచిలీపట్నం.
సెల్ నెం. 9885611988



విద్యుత్ దీపాల వెలుగుల్లో జాతీయ చిహ్నం



విద్యుత్ దీప కాంతుల్లో కలెక్టరేట్ ప్రాంగణం



కలెక్టరేట్ ప్రధాన ద్వారం నుంచి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

కలెక్టరేట్... కాంతులు..

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్ విద్యుత్ దీప కాంతులతో విరాజిల్లుతోంది. ఇటీవల కలెక్టర్‌గా ఉన్న రాజాబాబు కలెక్టరేట్ సుందరీకరణ పనులను చేపట్టి తీర్చిదిద్దారు. కలెక్టరేట్ ఆవరణలో గ్రానైట్‌తో మూడు సింహాల జాతీయ చిహ్నాన్ని ఏర్పాటు చేసి దానికి విద్యుత్ దీపాల వెలుగులు ఏర్పాటు చేశారు. వీటితో పాటుగా కలెక్టరేట్ ప్రధాన గేటు నుంచి లోపల ఉన్న కార్యాలయాల వరకు గొడుగు ఆకారంలో విద్యుత్ దీపాలతో పాటు దారిపొడవున గార్డెన్ లైట్లు ఏర్పాటు చేశారు. ఈ దృశ్యాలు నగర ప్రజలు, ఉద్యోగులకు ఆనందాన్ని నింపుతున్నాయి.